ప్రజాశక్తి

ఆదివారం 23 నవంబర్ 2025   8 పేజీలు

ప్రకాశం   బాపట్ల

పొగాకు నారు మూట..
రూ.7 వేలు.!

మొంథా తుపానుకు నారు దెబ్బతిన్న ఫలితం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పొగాకు నారు మూట ధర ఇప్పుడు అక్షరాలా రూ.7 వేలు. ఇంత ధర ఏంటనుకుంటున్నారా? మొంథా తుపాను దెబ్బకు జిల్లాలో పలుచోట్ల పొగాకు నారుమడులు దెబ్బతిన్నాయి. తోటల్లోనే కుళ్లిపోయాయి. దీంతో రాజమండ్రి ప్రాంతం నుంచి ఇప్పుడు నారు తెచ్చి నాట్లు వేస్తున్నారు. నాట్ల సీజన్ వచ్చేసింది. ఒక్కసారిగా నారుకు డిమాండు పెరగడంతో రాజమండ్రి నుంచి మూట నారు రూ.7 వేలకు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఇక్కడ ఉన్న కొద్దిపాటి నారుమడుల్లోనూ ఇదే ధర ఉంది. దీంతో రైతులు ఎకరాకు నారుకే రూ.14వేలు వెచ్చించాల్సి వస్తోంది. తుపానుకు జిల్లాలో పలుచోట్ల నారుమడులు దెబ్బతిన్నాయి. పెరిదేపిలోనే రూ.50 ఎకరాలు దెబ్బతింది. కోటి రూపాయలు నష్టం జరిగింది. ఇంకా పచ్చవ, కామేపల్లి, మద్దులూరు ప్రాంతాల్లోనూ నారుమడులు దెబ్బతిన్నాయి. గుండ్లకమ్మ ప్రాంతంలో వెల్లంపల్లి, అమ్మనబ్రోలు తదితర ప్రాంతాల్లోనూ వేసిన నారుమడులు పోయాయి. దీంతో ఒక్కసారిగా నారుకు డిమాండు పెరగడం, అందుబాటులో లేక పోవడంతో ధరలు పెంచేశారు. ఎవరి వ్యాపారం వాళ్లదైంది. వారం రోజులపాటు పొగాకు ధరలు పెరగడంతో నాట్లు వేగం పుంజుకున్నాయి. నారు ధర చూసి.. రైతులు వామ్మో అంటున్నారు.

కొత్త లేబర్ కోడ్‌లు..
కార్మికవర్గానికి ఉరితాళ్లు..

- ఉద్యోగ భద్రతపై పాలకుల ఉక్కుపాదం..
- కేంద్ర నిర్ణయంపై జిల్లాలోనూ నిరసన జ్వాల

హనుమంతునిపాడులో లేబర్ కోడ్స్ ప్రతులను దహనం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ప్రకటించిన నూతన లేబర్ కోడ్లు దేశవ్యాప్తంగా కార్మిక వర్గంలో తీవ్ర ఆగ్రహం రేపుతున్నాయి. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి.. వాటి స్థానంలో నోటిపై చేసిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను పూర్తిగా హరించేలా రూపొందించబడ్డాయని జిల్లాలోని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ట్రేడ్ యూనియన్లకు సమాచారం ఇవ్వకుండానే, సంప్రదింపులు జరపకుండానే కోడ్లను అమలు చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని సంఘాలు తీవ్రంగా విమర్శించాయి.

ఉద్యోగ భద్రతపై ఉక్కుపాదం..

ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ అమల్లోకి రావడంతో 300 మంది వరకు ఉద్యోగులు ఉన్న సంస్థలు కార్మికులను ప్రభుత్వ అనుమతి లేకుండానే తొలగించే స్వేచ్ఛ పొందాయి. దీంతో వేలాదిమంది ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయని యూనియన్లు హెచ్చరిస్తున్నాయి. సమ్మె హక్కులను అడ్డుకునే విధంగా 14 రోజుల నోటీసు వ్యవధిని 60 రోజులకు పెంచడం, యూనియన్ గుర్తింపు కోసం 51 శాతం సభ్యత్వం షరతు విధించడం కార్మిక ఉద్యమాలను బలహీనపరచే యత్నమని కార్మిక సంఘ నేతలు అభిప్రాయపడుతున్నారు.

జీతాల్లో కోత-12 గంటల పని బాదుడు..

వేతన కోడ్ అమలుతో బేసిక్ వేతనం పెరుగుతుందని చెప్పినా, పిఎఫ్, గ్రాట్యుటీ వంటి కోతలు విధించడంతో కార్మికులకు చేతికి అందే జీతం తగ్గిపోతుంది. ఇదిలావుండగా రోజుకు 12 గంటల పని దినానికి మార్గం సుగమం కావడంతో కార్మికుల ఆరోగ్యం, వ్యక్తిగత జీవితం ప్రమాదంలో పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

సామాజిక భద్రతలో స్పష్టత లేకుండా..

గిగ్, కాంట్రాక్ట్ కార్మికులను గుర్తించినప్పటికీ వారికి లభించాల్సిన రక్షణలు ఏవన్నది చట్టంలో స్పష్టంగా చెప్పకపోవడం కార్మిక భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టిందని సంఘాలు ఆరోపిస్తున్నాయి.

కార్పొరేట్లకు లాభం-కార్మికులకు శరాఘాతం..

పెట్టుబడిదారులకు వసతులు కల్పించడమే కొత్త కోడ్ల ముఖ్య ఉద్దేశమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పరిశ్రమలకు ▶ 2లో

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

దండకారణ్యంలో
ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

▶ 8లో

న్యాయస్థానాల్లో
సులభతర సేవలు..

- హైకోర్టు పరిపాలన
- న్యాయమూర్తి నిమ్మగడ్డ

కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు

ప్రజాశక్తి-మార్కాపురం

న్యాయస్థానాలలో ప్రజలకు సులభతరంగా సేవలందించడానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు పరిపాలన న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మార్కాపురంలోని కోర్టు భవనాల సముదాయంలో 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్-సెషన్స్ జడ్జి భవనాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ వర్చువల్ విధానంలో శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హైకోర్టు పరిపాలన న్యాయమూర్తి నిమ్మగడ్డ మాట్లాడుతూ న్యాయ స్థానాల్లో న్యాయసేవలు అందించడానికి అవసరమైన భవనాలను నిర్మిస్తామన్నారు. న్యాయమూర్తుల నివాసాలకు అవసరమైన భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కాపురం జిల్లా కేంద్రం చేయాలని ఈ ప్రాంత ప్రజల నుండి డిమాండ్ ఉందన్నారు. రాబోయే రోజుల్లో మార్కాపురం జిల్లా కేంద్రంలో కోర్టు భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జి.రామకష్ణప్రసాద్ మాట్లాడుతూ మార్కాపురంలో కోర్టు భవనాలు నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మార్కాపురం కోర్టు ప్రాంగణంలో భవనాల శంకుస్థాపనకు గతంలో ఇక్కడకు రావడం జరిగిందని, చాలా తక్కువ వ్యవధిలో భవన నిర్మాణాలు పూర్తి చేశారని చెప్పారు. సామాన్య ప్రజలకు న్యాయం అందించడానికి కోర్టు భవనాలు నిర్మించడం చాలా అవసరమని చెప్పారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వై.లక్ష్మణరావు మాట్లాడుతూ మార్కాపురంలో మరో రెండు కోర్టు భవనాలు నిర్మించడం వల్ల ప్రజల ముంగిటకే న్యాయస్థానాలు వచ్చినట్లు ఉందని ఆయన అన్నారు. కోర్టుల్లో వేలాదిగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కోర్టు ప్రాంగణాల్లో అదనపు భవనాలు నిర్మించడం వల్ల కేసులు త్వరగా పరిష్కారమవుతాయన్నారు.

కలెక్టర్ వి.రాజాబాబు మాట్లాడుతూ జిల్లాల విభజన నేపథ్యంలో ప్రకాశం జిల్లా అతిపెద్ద జిల్లాగా ఏర్పడిందని అన్నారు. జిల్లాలో 80 శాతం మంది ▶ 2లో

అత్యంత పారదర్శకంగా
ధాన్యం కొనుగోళ్లు..

- అల్పపీడనం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి..
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది లేకుండా అత్యంత పారదర్శకతతో కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మద్దతు ధరతో ధాన్యం సేకరించడానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అన్నారు. గ్రేడ్-ఏ రకం క్వింటాల్ ధాన్యం ధర రూ.2,389 కాగా, సాధారణ రకం ధాన్యానికి క్వింటా రూ.2,369గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే క్వింటాకు రూ.69 ధర పెరిగిందన్నారు. జిల్లాలో 2,91,109 ఎకరాలలో 1,66,553 మంది రైతులు వరి పంటను సాగు చేశారన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతులిచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఆన్‌లైన్ ద్వారా మిల్లులు, రైతులను అనుసంధానిస్తున్నట్లు చెప్పారు. 117 కొనుగోలు కేంద్రాలను ఆర్ఎస్‌కెలలో ఇప్పటికే ప్రారంభించామన్నారు. గతేడాదిలో 90 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రైతులు ముందస్తుగా ఆర్.ఎస్.కె.లలో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తదుపరి రైతులు స్లాట్ బుక్ చేసుకుంటే వారి మొబైల్ ఫోన్‌కు తెలుగులోనే సమాచారం వస్తుందన్నారు. ఆన్‌లైన్ ఆధారంగా సంపూర్ణ నిశిత పరిశీలన చేస్తామన్నారు. రైతులు తమకు కేటాయించిన సమయంలోనే ధాన్యం తెచ్చుకోవాలన్నారు. రైతులంతా ప్రభుత్వాన్ని నమ్మారు, అందుకని వారికి మేలు చేయడానికే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందన్నారు. రైతుల ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు ▶ 2లో

కొత్త లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరితాళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో తెరచిన తలుపులుకార్మికులకు 'ఈజ్ ఆఫ్ లూజింగ్ జాబ్'గా మారబోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్రం నిరంకుశ వైఖరి స్పష్టమైంది..
కాలం సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు

కార్మికులు శతాబ్దాలపాటు పోరాడి సాధించిన చట్టాలను ఒక్కసారిగా రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకార పాలనకు ఉదాహరణ. కొత్త లేబర్ కోడ్లు కార్మికులను బానిసలుగా మార్చే ప్రమాదం ఉంది. కార్మికులు ఐక్యంగా పోరాడి ఈ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకునేలా ఒత్తిడి చేయాలి.

ప్రతిపాదన తక్షణమే ఉపసంహరించాలి..
ఎం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కేంద్రం తలపెట్టిన లేబర్ కోడ్ల అమలు ప్రక్రియను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించాలి. కేంద్రం అమలు చూపుతున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు తిరుగుబాటు చేయక తప్పదు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరిచే లక్ష్యంగా నిర్దేశించిన లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు తిరుగుబాటు చేయాలి. దీనికి విశాల ఐక్యత సమకూర్చుకోవాలి. ఆ దిశగా కార్మికులు ఐక్యం కావలసిన అవసరం ఉంది.

న్యాయస్థానాల్లో సులభతర సేవలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారని చెప్పారు. ఈ ప్రాంతంలో భూముల సమస్యలు కోర్టుల్లో చాలా పెండింగ్ లో ఉన్నాయన్నారు. మార్కాపురంలో అదనపు కోర్టు భవనాలు నిర్మించడం వలన కేసులు సులభతరంగా పరిష్కారం చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి, అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజా వెంకటాద్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ అలిజహీర్, న్యాయాధికారులు, న్యాయవాదులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

(మొదటిపేజీ తరువాయి)

తలెత్తకుండా సేకరణ సిబ్బందికి మూడు పర్యాయలు శిక్షణ ఇచ్చామన్నారు. రైతులకు సందేహాలు, సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బంగాళా ఖాతంలో సాండియో అల్పపీడనం ఏర్పడుతుందని, 24వ తేదీన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తం కావాలన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రైస్ మిల్లుల నుంచి బ్యాంకు పూచికత్తుతో ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట మాట్లాడుతూ ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులు నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆర్ఎస్‌కెలలో పేర్లు నమోదు చేసుకున్న వారికి ముందుగా టోకెన్ ఇస్తారని, ఎప్పుడు రావాలో తేదీ నిర్ణయించి, సమయం వారి ఫోన్‌కు సమాచారం వెళుతుందన్నారు. 73373 59375 వాట్సాప్ నెంబర్ కు హాయ్ అని పంపితే మీకు స్లాట్ బుక్ చేస్తారన్నారు. ధాన్యం తెచ్చే రైతులు 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. తేమ అధికంగా ఉంటే ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టుకోవాలని సూచించారు. రైతులు ఏ ప్రాంతంలోనైనా తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. రైతుల సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్: 1967, జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్: 77028 06804 అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఈ విషయాలను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

చిన్నదోర్నాల గ్రామానికి చెందిన దానమ్మకు సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్లా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె జబ్బుతో బాధపడుతున్న తనకు రక్తం అందించిన షేక్ అబ్దుల్లాకు, సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ నాయకులు షేక్ షేక్షావలికి, డ్రైవర్ల కమిటీ సభ్యులకు రుణపడి ఉంటానని ఆమె తెలిపారు. షేక్ సర్దార్, అలుగుల దేవదాస్, షేక్ చాంద్, షేక్ వలి, చల్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలతో విద్యా బోధన సాగాలి

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థుల భవిష్యత్తు కోసం మెళకువలతో కూడిన విద్యాబోధన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక జెడ్పి బాలుర ఉన్నత పాఠశాల వేదికగా మండల పరిధిలోని ప్రభుత్వ ఆధీనంలో గల వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శనివారం మధ్యాహ్నం కాంప్లెక్స్ సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. నోడల్ అధికారిగా మండల విద్యాశాఖ అధికారి రాందాస్ నాయక్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు, ఎస్జీటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక, డిసెంబర్ నెలలో జరగబోయే మెగా పిటిఎం గురించి చర్చించారు. ఎస్‌సిఇఆర్‌టి వారు విడుదల చేసిన టైం టేబుల్ ప్రకారం సబ్జెక్టు వారీగా సముదాయ సమావేశాలు నిర్వహించినట్లు నోడల్ అధికారి రాందాస్ నాయక్ తెలిపారు.

అవినీతికి తావు లేకుండా ఉపాధి పనులు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలో అవినీతికి తావులేకుండా ఉపాధిపనులు జరగాలని టిడిపి మండల కన్వీనర్ పోట్ల.గోవిందు అన్నారు. మండలంలోని ఇసుకత్రిపురవరం గ్రామంలో శనివారం జరిగిన ఉపాధిహామీ గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గోవిందు మాట్లాడుతూ, మండలంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని అధికారులకు సూచించారు. పారదర్శకంగా ఉపాధి పనులు జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఉపాధి పనులను కల్పించిందన్నారు. ప్రజలందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలన్నారు. కొత్తగా జాబ్ కార్డులు కావలసినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఉపాధి కూలీ ఈ కేవైసి చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సదస్సులో 'ఏలూరి'

ప్రజాశక్తి-మార్కాపురం

హైదరాబాద్‌లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 'ఇన్వెస్ట్ మధ్యప్రదేశ్' పారిశ్రామిక సదస్సులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలతో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. ఫార్మా అండ్ బయోటెక్ రంగాలపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశంలో బిడిఎంఎఐ నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడుల అవకాశాల గురించి చర్చించారు.

సివిల్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ

25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-మార్కాపురం

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని గొల్లపూడిలో వెనుకబడిన వర్గాల నిరుద్యోగులకు సివిల్ పరీక్షల కోసం ఉచిత శిక్షణ తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తుందని మార్కాపురం ఎబిసిడబ్ల్యుఓ షేక్ మహ్మద్‌ఖాశిం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబర్ 5న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. అందులో అర్హత సాధించిన వారికి డిసెంబర్ 10వ తేదీ నుంచి విజయవాడలోని గొల్లపూడిలో శిక్షణ ఉంటుదన్నారు. దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కులు జాబితా, ఇంటర్ మార్కులు జాబితా, డిగ్రీ మార్కుల జాబితాతో పాటు కుల ధృవీకరణ, ఆదాయ పత్రాలు జత చేయాలన్నారు. ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే ఉండాలని చెప్పారు. వీటితో పాటు ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతమపర్చాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాయాల కాంప్లెక్స్‌లోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మార్కాపురంలో 1 నుంచి పత్తి కొనుగోలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ఇటీవల ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించిన విసయం తెలిసిందే. ఈ కేంద్రంలో పత్తి కొనుగోలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి శనివారం తెలిపారు. క్వింటా పత్తి రూ.8,110కి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. మార్కాపురం ప్రాంత పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

'స్వామిత్వ'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామ పంచాయతీలో శనివారం సర్పంచ్ జడ్డా నారాయణమ్మ అధ్యక్షతన స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఎంపీడీవో ఎంబ మురళి పాల్గొని మాట్లాడుతూ స్వామిత్వ ప్రాముఖ్యత గురించి వివరించారు. గ్రామంలో ఉన్న అన్ని గృహాలను సర్వే చేసి హద్దులు నిర్ణయించి పూర్తిగా హౌస్ మ్యాప్ ఇస్తామన్నారు. ఇంటి కొలతల్లో తేడాలు ఉన్నట్లయితే అభ్యంతరాలు తెలియపరచాలని ఈ సభను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

Notice Under Order 5,Rule 1&5 of C. P. C

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.12/2022

నిడమానూరి శివ కిషోర్ ...వాది

వర్సెస్

జాగర్లమూడి సత్యనారాయణ ... ప్రతివాది

ప్రతివాది :

జాగర్లమూడి సత్యనారాయణ తండ్రి హనుమంతరావు R/o పేరాయ పాలెం గ్రామం, అద్దంకి మండలం, ప్రకాశం జిల్లా.

పై నంబర్‌న వాది మీపై దావా పరిహార నిమిత్తం దావా దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు మీకు నోటీస్ నిమిత్తం తేదీ:25-11-2025నకువాయిదా వేసినారు. గాన మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలియ చేసుకొనగలరు. లేనియెడల నీ పరోక్షమున దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 25-11-2025

ఇట్లు
మానం రామాంజనేయులు,
వాది తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా
సెల్:9032270354

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.32/2024
O.S.No.172/2016

సానికొమ్ము రామాంజనేయ రెడ్డి ... డిక్రిహోల్డర్

వర్సెస్

అందం తిరుపతమ్మ వగైరాలు ... జడ్జిమెంట్ డేటార్స్

JDRs 1to 4:-

1. అందం తిరుపతమ్మ W/o లేట్ గాలయ్య,
2. అందం సత్యనారాయణ తండ్రి లేట్ గాలయ్య
3. అందం ఆంజనేయులు తండ్రి లేట్ గాలయ్య
4. జడల సత్యవతి భర్త వెంకటేశ్వర్లు

JDRs 1to 4 are R/o చందలూరు గ్రామం, దర్శి మండలం, ప్రకాశం జిల్లా.

పై నంబరు అమలు దరఖాస్తులో డిక్రిహోల్డర్ మీపై అమల దరఖాస్తు పరిహార నిమిత్తం అమలు దరఖాస్తు చేయగా శ్రీ కోర్టు వారు మీకు నోటీస్ నిమిత్తం తేదీ:26-12-2025నకువాయిదా వేసినారు. గాన మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలియ చేసుకొనగలరు. లేనియెడల నీ పరోక్షమున దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 26-12-2025 ఇట్లు
మానం రామాంజనేయులు,
వాది తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా
సెల్:9032270354

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన గోగినేని చంద్రశేఖర్ తండ్రి రవీంద్రబాబు,గోగినేని రత్నకుమారి భర్త నాగబోయిన వాసులకు చెందిన నెం:213/2024 నెంబరు గల ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి అందుకు సంబందించిన భూములను పోకూరి రామారావు తండ్రి నాగభూషణం, సిరిగిరి లక్ష్మి భర్త వెంకటరమణ, అమరనేని గౌతమ్‌కుమార్ తండ్రి రఘనాథ్ అను మేము కొనుగోలు చేసిరిజష్టరు చేయించుకుంటున్నాం అందుకు సంబందించి ఎవరికైన అభ్యంతరరాలు ఉంటే ఈక్రింది అడ్రసుకు తెలియపరచాలని కోరుచున్నాం.

ఇట్లు
పోకూరి రామారావు
తండ్రి నాగభూషణం
ఫోన్ నెంబరు 9642229369

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 247/2021

Between

ఇప్పల వీరాంజిరెడ్డి ......పిటీషనర్/ వాది

Vs

ఇప్పల వీరమ్మ (Died) LRS ఇప్పల మల్లేశ్వరమ్మ మరియు ఇతరులు ..... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

1. తాటిపర్తి బుల్లెమ్మ
W/o వెంకటేశ్వర రెడ్డి (3వ రెస్పాండెంటు)
2. మిర్ల అంజమ్మ
W/o లేటు అంజిరెడ్డి (4వ రెస్పాండెంటు)
3. ఇప్పల రామిరెడ్డి
S/o యల్ల మందారెడ్డి (5వ రెస్పాండెంటు)
4. ఇప్పల అంజిరెడ్డి
S/o యల్లమందారెడ్డి (6 వ రెస్పాండెంటు)

5 to 6 రెస్పాండెంట్లు R/o కూకట్లపల్లి గ్రామం, పోస్టు, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా, అద్దంకి డిఎంసి

7. పమ్మి కోటేశ్వరమ్మ W/o అంజిరెడ్డి
R/o కొత్తపాలెం గ్రామం, పోస్టు నూజెండ్ల మండలం, పల్నాడు జిల్లా, నరసరావుపేట డి.ఎం.సి

పైనంబరు దావాను వాది దావా పరిహారమును పొందు నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 1వ ప్రతివాదిగా చూపబడిన ఇప్పల వీరమ్మ దావా పెండింగులో ఉండగా చనిపోయినందున ఆమె వారసులైన మిమ్ములను I.A.No:693/2023 నంబరున ఆర్డర్ 22 రూల్ 4సి.పి.సి ప్రకారం చనిపోయిన ఒకటవ ప్రతివాదికి వారసులుగా చేర్చమని దాఖలు కాబడిన ఈ నెంబరు పిటిషనులో 3 to 7 రెస్పాండెంట్లుగా చూపబడిన మీరు అటులనే I.A. No :692/2023 నంబరున ఆర్డర్ 22 రూల్ 9 సి.పి.సి ప్రకారం చనిపోయిన ఒకటవ ప్రతివాదికి వారసులను ఈ దావాలో పార్టీలుగా చేర్చుటకు జరిగిన కాలయాపనకు సంబంధించి ఎబెట్ మెంట్ ఆర్డర్‌ను సెట్ -ఎసైడ్ చేయమని కోరుతూ వాది దాఖలు చేసిన ఈ పిటిషనులో 3 to 7 రెస్పాండెంట్లుగా చూపబడిన మీరు మరియు I.A.No:691/2023 నంబరున సెక్షన్ 5 లిమిటేషన్ యాక్టివ్ ప్రకారం ఎబెట్ మెంట్ ఆర్డర్ ను సెట్ - ఎసైడ్ చేయమని కోరుచూ దాఖలు చేయవలసిన పిటిషన్ గురించి జరిగిన ఆలస్యమును కండోన్ చేయమని కోరుచూ వాది దాఖలు చేసిన ఈ పిటిషనులోను 3 to 7 రెస్పాండెంట్లుగా చూపబడిన మీరు ఈ విషయమై కోర్టు ద్వారా మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల27-12-2025వ తేది ఉదయం 10.30 ని.లకు వాయిదా వేసి యున్నందున పై కోర్టు వారు ఎదుట స్వయంగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు//

అద్దంకి ఇట్లు
తేది : 22-11-2025 **పంచాగ్నుల రమేష్**
పిటిషనర్/ వాది తరుపు అడ్వకేట్
అద్దంకి బాపట్ల జిల్లా
సెల్ నెంబరు : 99487 88290

ప్రజాశక్తి 3
ఆదివారం 23 నవంబర్ 2025

వెలిగండ్లలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

సీఎస్‌పురంలో..

చీమకుర్తిలో..

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-వెలిగండ్ల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లలను నోటిఫై చేయడాని జిల్లా సిఐటియు కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని సిఐటియు జిల్లాకార్యదర్శి రాయళ్ళ మాలకొండయ్య అన్నారు. శనివారం వెలిగండ్ల అంబేద్కర్ సెంటర్లో లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. రాయళ్ళ మాలకొండయ్య మాట్లాడుతూ పెట్టుబడిదారులకు ప్రయోజనాలను కాపాడటానికి మాత్రమే బిజెపి ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కుకింగ్ ఏజెన్సీ యూనియన్ అధ్యక్షులు గుంటకాని నాగమ్మ, ఆదిలక్ష్మి, అనంతలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, కాశీ రజిత , రత్తమ్మ, స్కూల్ ఆయా బోగం చెన్నమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు బ్రహ్మయ్య, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు సుబ్రహ్మణ్యం, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కండె బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: హనుమంతునిపాడులో సిఐటియు ఆధ్వర్యంలో లేబర్ కోడ్ కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏ సంఘం అధ్యక్షులు రాణి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక హక్కులను హరించేవిగా ఉన్నాయన్నారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు వీరి పోరాటానికి మద్దతుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మెటల్దా బ్యూలా కుమారి, వెంకటరత్నం, మనీషా, లక్ష్మి, సాలమ్మ, గురు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంరూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్లు శ్రామిక వర్గాలకు శాపంగా మారనున్నదని సిఐటియు సీనియర్ నాయకులు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ముందుగా నాలుగు లేబర్ కోడ్ల అమలు జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ సర్కార్ అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్లు కోట్లాదిమంది కార్మికుల కుటుంబాలను చీకటి పాలు చేయనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఊసా రాజ్యలక్ష్మి, నాయకులు బక్క ఏసురత్నం, బి జాకబ్, పి కొండలరావు, పి నర్సింహులు, ఎం రామయ్య పాల్గొన్నారు.

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల హరిస్తూ కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గ్రానైట్ కార్మికులు నిరసన తెలిపారు. శనివారం కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలలో మార్పులు తీసుకొచ్చిందని విమర్శించారు. కార్మికులు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ ను వెంటనే వెనక్కు తీసుకొని కార్మిక చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరుతున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇట్ట నాగయ్య, పాటిబండ్ల పద్మ, పాలేటి ఏడుకొండలు, గ్రానైట్ వర్కర్ యూనియన్ నాయకులు అప్పలనాయుడు, కనకరాజు, ప్రసాదు , పుల్లయ్య కార్మికులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు: లేబర్ కోడ్‌లను వెంటనే విరమించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఉధృతం చేపడతామని మాజీ సిఐటియు జిల్లా కార్యదర్శి కే మాల్యాద్రి అన్నారు. శనివారం సుందరయ్య భవనం సెంటర్లో నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న కార్మిక వర్గానికి ఉరితాలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్మికులకు వెట్టి బానిసలుగా మార్చే చట్టాలను. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరావు, కో కన్వీనర్ పండిటి శ్రీనివాసులు, ఎస్ పిచ్చి రెడ్డి, పందిటి శ్రీనివాసులు, మోరుబోయిన శ్రీనివాసులు, ఆరెతోటి సుబ్బారావు, రమణయ్య , వార్డు నెంబర్ షేక్ ఇస్మాయిల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యాట వీరనారాయణ, జెవివి నాయకులు కే శంకర్ పాల్గొన్నారు.

టంగుటూరు: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిఐటియు టంగుటూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. శనివారం టంగుటూరులో సిఐటియు ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరు రాము, వ్యవసాయ కార్మిక ఉపాధ్యక్షులు వి.మోజెస్, జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ మున్వర్ భాష, టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షులు కార్యదర్శులు తిరుమలరావు, కాశి, మహేష్ ఐఎఫ్‌టియు నాయకులు టంగుటూరు వెంకటరావు, శేషయ్య, సుబ్బారావు, శివయ్య పాల్గొన్నారు.

మద్దిపాడు: సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన మద్దిపాడులో లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు ఉబ్బా ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి చేస్తూ ఉత్తరులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. అనంతరం ఉత్తర్వుల కాగితాలను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు కనపర్తి సుబ్బారావు, కాసిం, కాకుమాను సుబ్బారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు, సాయి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 12 గంటల పని విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కనిగిరిలో శనివారం మండల కార్యాలయం నుంచి సుగుణవతమ్మ హాస్పిటల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీసీ కేశవరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో సాధించిన 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి లేబర్ కోడ్ల పేరుతో కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పి.నరేంద్ర, సిఎచ్ ప్రసాద్, ఏడుకొండలు, గురవయ్య, అడివయ్య ప్రసాద్, ఎలీషా, ఓబయ్య, వేణుగోపాల్, లక్ష్మయ్య, టోపీవలి, చెన్నారెడ్డి, వలి, గరతయ్య, రమణమ్మ, రోజమ్మ, షమీల, మల్లేశ్వరి, లాల్ బీ, ఎలిషమ్మ, రమణమ్మ, ఆదిలక్ష్మి, రత్తమ్మ, సుప్రియ పాల్గొన్నారు.

టంగుటూరులో..

కనిగిరిలో..

మద్దిపాడులో..

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ నిషేధం కొనసాగించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములను ఫ్రీహోల్డ్ నిషేధం నుంచి తొలగించాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. శనివారం పెరిదేపిలోని యం.ఎస్.విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మల్లెల సంపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫ్రీహోల్డ్ భూముల నిషేధం రద్దు – పేదలపై ప్రభావం అనే అంశం మీద ఆంజనేయులు మాట్లాడుతూ భూముల ఫ్రీ హోల్డ్ కల్పించడం అంటే పేదల చేతుల్లోని భూములను ప్రైవేటు వారికి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమేనని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించుకునేందుకు ప్రభుత్వ భూములు కాపాడటం, పట్టణ అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం, సామాజిక న్యాయాన్ని కాపాడటం, వ్యవసాయ కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం లాంటి లక్ష్యాల కోసం భూ పంపిణీ జరిగిందని తెలిపారు. అలా పంచిన భూములు, కేటాయించబడిన భూములు ఫ్రీ హోల్డ్ నిషేధం ఇప్పటివరకు కొనసాగుతున్నదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ మాట్లాడుతూలి మండలంలో పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని, అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పారాబత్తిన శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు లెక్కేపోగు దావీదు, గడ్డం గోపి, పెరికల ఆదం, పి రవికుమార్, సీదల ఏడుకొండలు, పి జకరయ్య, ఎల్ పరిశుద్ధ రావు, యం. సరిత, ఎ.చంద్రమ్మ, అంకన్న, సురేష్, ఎల్ జాన్, సీనియర్ నాయకులు అంగాలకుర్తి బ్రహ్మయ్య, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

సైకిల్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

సైకిల్‌ని టిప్పర్ లారీ ఢీకొట్టడంతో సైకిల్‌పై వెళ్తున్న ఆయుర్వేద వైద్యుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని లారీ యూనియన్ ఆఫీస్ సమీపంలో శనివారం జరిగింది. టంగుటూరు గ్రామపంచాయతీ పరిధిలోని పోతుల చెంచయ్య కాలనీకి చెందిన సానికొమ్ము మాణిక్యాలరావు(70) మోటార్ సైకిల్ మీద ఉలవపాడుకు వెళుతుండగా శింగరాయకొండ వైపు నుంచి కంకర లోడుతో టిప్పర్ లారీ డ్రైవర్ నిద్ర మత్తుతో సైకిలును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాణిక్యాలరావుపైకి లారీ టైరు ఎక్కడంతో శరీరం నుజ్జు నుజ్జు అయింది. ఎస్ఐ బి.మహేంద్ర, హైవే పెట్రోలింగ్ పోలీసులు చేరుకొని అక్కడ ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పరిశీలించి కేసు నమోదు చేశారు. మాణిక్యాలరావు మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైశాలకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా మాణిక్యాలరావు సైకిల్ మీద గ్రామాల్లో తిరుగుతూ ఆయుర్వేదం వైద్యం చేసుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయన మృతితో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు.

చైన్ స్నాచర్‌కు రిమాండ్

ప్రజాశక్తి-మద్దిపాడు : చైన్ స్నాచర్‌కు జిల్లా కోర్టు శనివారం రిమాండ్ విధించింది. మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బూరెపల్లి పునరావాస కాలనీలో రావిపాటి వెంకటరత్నం మెడలోని గొలుసును ఎ.వినోద్ అనే వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. సీసీ కెమెరా సాంకేతిక నైపుణ్యంతో చాకచక్యంగా వ్యవహరించి శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన సమయంలో నిందితుని వద్ద మూడు సవర్ల బంగారు గొలుసుతో పాటు అతని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు 15 రోజులు పాటు రిమాండ్ విధించింది. నిందితుడిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్ఐ వెంకట సూర్య అభినందించారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 71 బేళ్ళు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పీరాపురం, జాళ్లపాలెం, అయ్యవారిపాలెం, తంగెళ్ల గ్రామాలకు చెందిన రైతులు 1276 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు అందులో 905 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 371 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 310, కనిష్ట ధర కేజీ రూ 50, సరాసరి ధర కేజీ 118.88 గా నమోదయింది.

టంగుటూరు: టంగుటూరు, జరుగుమల్లి, కారుమంచి, యం.నిడమానూరు, కె.ఉప్పలపాడు గ్రామ రైతులు 797 బేళ్లను అమ్మకానికి తీసుకు వచ్చారు. 546 బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాలతో 251 బేళ్లను తిరస్క రించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 310, కిలో పొగాకు అత్యల్ప ధర రూ.50, సరాసరి ధర రూ.172.79 పైసలు పలి కింది. పొగాకు వేలంలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-టంగుటూరు : నవంబర్ 26న 76వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని దళిత బహుజనులు ఘనంగా నిర్వహిం చాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. శనివారం టంగుటూరు మండల కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ దళితుల పోరా టాలు, ఆచరణ వల్లే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, బహుజన చైతన్య సమితి కన్వీనర్ ఎం.కృష్ణ రావు, దాసరి తిరుపతి, ఈశ్వర్ తదితరులున్నారు.

'విద్యార్థి అసెంబ్లీ'కి పూసపాడు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఆలూరి రాజశేఖర్

ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యార్థి అసెంబ్లీకి వివిధ స్థాయిలో జరిపిన పోటీల నుంచి పూసపాడు ఎస్‌కెవివిఎస్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఆలూరి రాజశేఖర్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిల్లో వ్యాసరచన, వకృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి, 9వ తరగతి మార్కులు, ఇతర అంశాలు పరిగణలో తీసుకొని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కె సాగర్ పర్యవేక్షించారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించే విద్యార్థి అసెంబ్లీలో తమ విద్యార్థి రాజశేఖర్ తమ నియోజకవర్గం నుండి పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలు, సమస్యలపై మాట్లాడిన విధానం ఆకర్షణీయంగా ఉందని అన్నారు. తమ విద్యార్థి మాక్ అసెంబ్లీకి ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ జివిఎల్‌కె ప్రసాద్, సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తిమ్మాయపాలెం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్న గొంగటి రామ్ చరణ్ రెడ్డి, 9వ తరగతి చదువుతున్న పొదిలి కార్తీక్ రెండు రోజుల క్రింతం ఒంగోలు నవోదయ పాఠశాల్లో జరిగిన 69వ ఎస్‌జిఎఫ్ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో తిమ్మాయిపాలెం విద్యార్థులు పోల్ వాల్ట్ క్రీడలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పాఠశాల హెచ్ఎం గంగాధర్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులు ఈనెల 24, 25 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండ లయోలా ఉన్నత పాఠశాల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పిఇటి యు మధు బాబు, కె సునీత, రవిలను అభినందించారు.

శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - నిజాంపట్నం

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నేత అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని ప్రజ్ఞం గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద రూ.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించునున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, అడవులదీవిలో డ్రైనేజీ సైడ్ కాలువ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. తొలత వారికి ఘన స్వాగతం పలకి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. దానిలో భాగంగా ప్రజల ప్రాథమిక సౌకర్యాల మెరుగుదలకు, అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు ఉరితాళ్లుగా మారే లేబర్ కోడ్స్

బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో లేబర్ కోడ్స్ ప్రతులు దహనం

లేబర్ కోడ్స్ ప్రతులు దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

కార్మికుల మెడకు ఉరి తాళ్లుగా మారే లేబర్ కోడ్స్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జిఒ కాపీలను దహనం చేసి పలు సంఘాల కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. కార్మిక వర్గం ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న లేబర్ కోడ్స్‌ను పెట్టుబడిదారుల మెప్పుకోసం మోడీ ప్రభుత్వం శుక్రవారం నోటిఫై చేసిందన్నారు. కార్మికుల హక్కులను హరించేందుకే లేబర్ కోడ్స్‌ను బిజెపి ప్రభుత్వం తెచ్చిందని అన్నారు. పని గంటల పెంపు, కార్మికుల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. పగలే మహిళలకు రక్షణ లేని పరిస్థితుల్లో రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించాలని చట్టం చేయడం సరైనది కాదన్నారు. మహిళలకు రాత్రిపూట పని ప్రదేశాల్లో భద్రత ఎవరు కల్పిస్తారని ప్రశ్నించారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయించేందుకు తెచ్చిన లేబర్ కోడ్స్‌ను కార్మిక వర్గం మూకుమ్మడిగా వ్యతిరేకించాలని కోరారు. లేబర్ కోడ్స్ కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం జిఒ కాపీలు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు కె శరత్, ఓ లక్ష్మణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, శ్రీనివాసు, పాఠశాల స్వీపర్ల యూనియన్ నాయకులు నాగమణి, లిదియా, ఎజి బీటెక్ కాలేజీ టైం స్కేల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అద్దంకి : లేబర్ కోడ్ బిల్లు అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నోటిఫై రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నోటిఫై జిఒ కాపీలు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కులు కాలరాసే విధంగా కార్మిక చట్టాలు రద్దుచేసి లేబర్ కోడ్ బిల్లు పేరుతో కార్మికులతో వెట్టి చాకిరి చేయించే విధానాలు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ తీసుకురావటం దుర్మార్గమని అన్నారు. దీన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిన్న మొన్నటి వరకు బీహార్ ఎన్నికలు ఉన్నందున నోటిఫికేషన్ చేయకుండా ఉన్నారని, ఎన్నికల అనంతరం లేబర్ కోడ్ బిల్లులను అమలు చేయడానికి పూనుకోవడం ప్రజలు, కార్మికులను మోసం చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం, కార్యదర్శి ఉసిరిపాటి సామ్యూల్, ఇంజనీర్ విభాగం అధ్యక్షులు డి జాన్, వీరయ్య, కృష్ణ, అలివేలమ్మ పాల్గొన్నారు.

అద్దంకిలో జిఒ కాపీలు దగ్ధం చేస్తున్న కార్మికులు

కూలి రేట్లు పెంచాలి

ప్రజాశక్తి - రేపల్లె

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి మణిలాల్

పెరిగిన ధరలకు అనుగుణంగా రైస్ మిల్లు ముఠా కూలీల కూలీ రెట్లు పెంచాలని, కార్మికులకు పీఎఫ్, గ్రాడ్యుటీ, బోనస్ అమలు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన రైస్ మిల్ ముఠావర్కర్స్, డ్రైవర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మికుల కొనుగోలు శక్తి తగ్గుతున్నదని అన్నారు. కార్మికుల వేతనాలు, కూలీ రేట్ల కంటే రోజువారీ ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు 100శాతం పెరుగుతుంటే అసంఘటిత రంగంలో పనులు చేస్తున్న కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. రైస్ మిల్ కార్మికులుగా అనేక మంది జీవనం గడుపుతున్నారని అన్నారు. కావున రోజువారి పెరుగుతున్న జీవనవ్యయం, నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలీ రేట్ల పెంచాలని కోరారు. పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి పిఎఫ్ అమలు చేయాలని, చట్ట ప్రకారం గ్రాడ్యుటీ, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి తిండి, ఆరోగ్యం, గృహ అవసరాలకు సరిపడా వేతనాలు ఉన్నప్పుడే సంక్షోభాలు రాకుండా ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాకా సుబ్బారావు, కార్యదర్శి యు రామకృష్ణ ప్రసాద్, కోశాధికారి నాగమల్లేశ్వరరావు, నాయకులు మల్లేశ్వరరావు, ఎం శ్రీను పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

లెటర్లు అందజేస్తున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

నేటి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం సిఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన మెగా జాబ్ మేళా ఉత్సాహభరితంగా సాగింది. వేలాదిగా వచ్చిన విద్యార్థులు, అభ్యర్థులు కార్పొరేట్ కంపెనీల నియామక ప్రక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు రాష్ట్రంలో యువత పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని అన్నారు. ప్రభుత్వ అవకాశాలు నిలిచిపోయాయని, ప్రైవేట్ ఉద్యోగాలు రాక ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఉద్యోగం రాకపోతే నిరాశపడకండని, నైపుణ్యాలు పెంచుకొని అవకాశాలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతి యువత భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతి గల 16 జాతీయ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నియామక ప్రక్రియ నిర్వహించాయి. ఐటీ, మార్కెటింగ్, హెల్త్‌కేర్, సేల్స్, మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్, సర్వీసెస్ వంటి అనేక విభాగాల్లో ఉద్యోగాలు ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఉత్సాహం నెలకొంది. కంపెనీల ప్రతినిధులు యువతలో కనిపించిన నైపుణ్యాలు, ప్రతిభను అభినందించారు. ఎంపికైన అభ్యర్థులకు మేళా ప్రారంభంలోనే ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో హర్షిని కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల రవికుమార్, ఎఎంసి చైర్మన్ గుంజి వెంకటరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లవన్న, స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ మాధవి పాల్గొన్నారు.

యోగాసనం పోటీలకు సిద్ధం చేసిన వేదిక

నేడు రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ యోగాసనం పోటీలు ఆదివారం ఉదయం 10 గంటలకు చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రారంభం అవుతాయని ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రెటరీ కె ప్రతిమ శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి పాఠశాల్లో మూడు వేదికలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలు 23 నుండి 25 వరకు జరగనున్నాయని తెలిపారు. అండర్14, 17, 19 బాల, బాలికల పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుండి 450 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. ఆయా జిల్లాల నుండి 50 మంది మేనేజర్లు, 20 మంది అఫీషియల్స్ హాజరు కాన్నారని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యోగా పోటీలను గ్రామ ప్రజల సహకారంతో నిర్వహిస్తున్నట్లు హెచ్‌శ్రీం చందలూరు గిరిజ తెలిపారు.

యోగా శిక్షణ ఇస్తున్న కృష్ణారెడ్డి

యద్దనపూడి : మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి విద్యార్థినులకు యోగాపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగలో పద్మాసనం వేసి నప్పుడు మనసులో అలజడి తగ్గి మానసిక ప్రశాంత ఏర్పడుతుందని అన్నారు. తద్వారా చదువుపై శ్రద్ధ పెరిగి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. ప్రతి ఒక్కరినీ యోగా పట్ల ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, జి శ్రీను, యోహాను, రామ మోహనరావు, సిహెచ్ శ్రీను, రజని, శ్రీదేవి, సరస్వతి, విద్యార్థులు నాన్సీ, సాత్విక, చాందిని, ప్రవ్వలిక పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'లో మోసం : వైసిపి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అన్నదాత సుఖీభవలో కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసినట్లు వైసిపి నాయకులు ఆరోపించారు. వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసిపి నాయకులు వైఎం. ప్రసాద్ రెడ్డి, బొట్ల రామారావు, మారెడ్డి సుబ్బారెడ్డి, మారెళ్ల బంగారు బాబు మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారన్నారు. రెండో ఏడాది అమలు చేసినా, ఏకంగా 7 లక్షల మంది రైతులను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. మొత్తం 46,85,838 మంది

ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనాన్ని చూపుతున్న వైసిపి నాయకులు

రైతులకు రెండు విడతలు కలిపి మొత్తం ఒక్కొరికీ రూ.10 వేలు మాత్రమే ఇచ్చారని వివరించారు. మొత్తం రూ.4,685 కోట్లు ఖర్చు మాత్రమేనని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 53,58,366 మంది రైతులకు ఏటా రూ.13,500 చొప్పున 5 సంవత్సరాల్లో ఒక్కొక్క రైతుకు రూ.67,500 వంతున అందించినట్లు తెలిపారు. కౌలు రైతులను కూడా ఆదుకున్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు అన్నదాత సుఖీభవను వర్తింపజే యకపోవడం అన్యాయమన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం మొత్తాన్ని లెక్కిస్తే రెండు సంవత్సరాలకు రూ.21,433 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఇచ్చింది కేవలం 4,685 కోట్లు మాత్రమేనని తెలిపారు. రైతులకు ఇంకా రూ.16,746 కోట్లు బకాయి ఉందన్నారు. ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, ధరల స్థిరీకరణ నిధి, ఈ క్రాప్, ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి పథకాలను నిలిపివేసి కూటమి ప్రభుత్వం రైతులను నష్టాల్లో నెట్టేసిందని వారు విమర్శించారు.

ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలి : డిఇఒ

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

స్కూల్ కాంప్లెక్స్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలని డిఇఒ కిరణ్ కుమార్ తెలిపారు. ఒంగోలులోని పివిఆర్ బాలుర హైస్కూల్ సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు హ్యాండ్ బుక్‌తో హాజరు కావాలన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయి అంచనాకు ఇవి అత్యంత అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్ఎ- 1 పరీక్షల ఎ, బి, సి, గ్రేడ్ వివరాలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కిషోర్‌బాబు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం. రాధిక, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

విద్యార్థులను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి, సీనియర్ కోచ్ నల్లూరి మోహనరావు ఆధ్వర్యంలో 69వ స్కూల్ గేమ్స్ కరాటే సెలక్షన్స్ శనివారం నిర్వహించారు. ఈ ఎంపికల్లో శ్రీప్రతిభ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 58 కిలోల విభాగంలో కె.కార్తిక్, 62 కిలోల విభాగంలో పి.ఆనంద్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్- 19 కరాటే 55 కిలోల విభాగంలో ఎం. మణికంఠ 62 కిలోల విభాగంలో ఎస్‌కె కబీర్, 72 కిలలో విభాగంలో ఎస్. సతీష్ 64 కిలోల విభాగంలో ఎం. మణికంఠ ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో ఈనెల 23 నుంచి 27 వరకూ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్ రామాంజనేయులు, సిఇఒ జయ ప్రకాష్ నారాయణ అభినందించారు. కరాటే పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయాన్ని అందించారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రౌడీ షీటర్లు, పాత నేరస్తులు తమ నేరప్రవత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని బాపట్ల జిల్లా ఎస్‌పి బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లకు, పాత నేరస్తులకు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రౌడీ షీటర్లు, పాత నేరస్తులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పిడి చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు తీసుకునే ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల ప్రస్తుత జీవన విధానం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారా? లేదా? వంటి విషయాలపై ఆరా తీసినట్లు తెలిపారు. గతంలో క్షణికావేశంలో నేరాలకు పాల్పడి, శిక్షలకు గురై అమూల్యమైన జీవితాలను పాడు చేసుకున్న అనేకమంది తమ నేరప్రవత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలను అదుపులో ఉంచి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ఉద్దేశమన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. నేరప్రవత్తిని విడనాడి సమాజంలో సత్ప్రవర్తనతో జీవించే వారికి ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

స్మార్ట్ కిచెన్ సెంటర్ల ఏర్పాటు నిలిపివేయాలి

మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జిల్లాలో స్మార్ట్ కిచెన్ సెంటర్ల పేరిట కేంద్రీకత వంటశాలలను ఏర్పాటు చేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సోమరాజులు, కార్యదర్శి కల్పన డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రభుత్వం దూరంపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే ఒంగోలు, త్రోవగుంట, ఎస్ఎన్ పాడు, కొండెపి, దర్శి, మార్కాపురం, పొదిలి, కనిగిరి, గిద్దలూరు, వై.పాలెం లాంటి పది కేంద్రాల నుంచి మొత్తం 187 పాఠశాలలలోని 22,031 మంది విద్యార్థులకు ఒకే చోట వండి 1 నుంచి 12 కిలోమీటర్ల దూరంలో పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రీకత వంటశాలల వల్ల పాఠశాలల్లో వేడివేడిగా ఆహారం అందే అవకాశం ఉండటం లేదన్నారు. చిన్న పిల్లలు చల్లారిన ఆహారం తినాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పథకాన్ని ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడం వల్ల ఇప్పటి వరకూ ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్న పేద మహిళలు ఉపాధి కోల్పోతారని గుర్తు చేశారు.గతంలో జిల్లాలో ఏక్తాశక్తి అనే ప్రైవేట్ సంస్థకు పథకాన్ని అప్పగించగా తీవ్ర అనర్థాలు జరిగాయనిగుర్తు చేశారు. నాసిరకమైన భోజనం, నూనె వాసన, పిల్లలు తినక పందులకు, గేదెలకు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకించిన విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు. వ్యతిరేకతల నడుమ ఆ నిర్ణయాన్ని రద్దు చేసి తిరిగి పాఠశాలల్లోనే వండి పెట్టే పద్ధతిని పునరుద్ధరించారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు కూడా పాఠశాలల్లోనే వేడిగా ఆహారం వండి అందించాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. స్మార్ట్ కిచెన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు.కిచెన్‌షెడ్లు లేని పాఠశాలల్లో వెంటనే నిర్మించాలని,ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక్క విద్యార్థికి రూ.20 చొప్పున బడ్జెట్ కేటాయించాలని, పథక కార్మికులకు కనీస వేతనం రూ. 10,000 చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు దర్శిలో జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందిస్తూ, మూఢనమ్మకాలపై ప్రశ్నించే ధోరణిని నిర్మాణాత్మకంగా పెంచేందుకు జన విజ్ఞాన వేదిక ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు దర్శిలో ఆదివారం ప్రారంభం కానున్నాయి. దర్శి ఝాన్సీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవనున్నట్లు జెవివి జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్, విద్యాశాఖ అధికారులు, వైద్యులు, జెవివి రాష్ట్ర, జిల్లా నాయకులు, సైన్స్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈనెల 4న జిల్లావ్యాప్తంగా నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో మొదటి స్థానాలు సాధించిన ఉన్నత పాఠశాలల బృందాలు జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్‌జిఒ మహిళా విభాగం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఒంగోలు తాలూకా యూనిట్ మహిళా విభాగం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్‌జిఒ హోంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. చైర్ పర్సన్‌గా ఎస్.జ్యోతి, కో చైర్‌పర్సన్‌గా వై.సంతోష కుమారి ఎన్నికయ్యారు.కో చైర్మన్-2గా ఐ అలేఖ్య, వైస్ చైర్మన్లుగా దీప్తి, మల్లిక, మస్తాన్ బి, ఆర్.సునీల, కవిత, కన్వీనర్‌గా సుప్రియ, కో కన్వీనర్-1గా అరుణ ప్రణతి, కో కన్వీనర్-2గా సయ్యద్ షమ్మి ఎన్నికయ్యారు. కన్వీనర్-1గా లావణ్య, కన్వీనర్-2గా ఎం.సుజాత, సంయుక్త కన్వీనర్-3గా - కె భూషమ్మ, సంయుక్త కన్వీనర్ -4గా యామిని, ఆర్గనైజింగ్ కన్వీనర్ గా. దేవమ్మ, కల్చరల్ కన్వీనర్-1గాకిరణ్మయి, కల్చరల్ కన్వీనర్-2గా రోహిణి, స్పోర్ట్స్ కన్వీనర్-1గా శివ జ్యోతి, స్పోర్ట్స్ కన్వీనర్-2గా ఆశాలత, క్యాషియర్‌గా స్వర్ణలత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం, సంఘబలాన్ని పెంపొందించే దిశగా కొత్త కమిటీ చురుకైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నిక అయిన మహిళా కార్యవర్గ సభ్యులు కూడా సంఘ అభివద్ధి కోసం కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ మాధవి, జిల్లా చైర్పర్సన్ కె కోటేశ్వరమ్మ, కన్వీనర్ శిరీష తదితరులు పాల్గొన్నారు

మనువాద భావజాలానికి వ్యతిరేకంగా

మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి. కొండారెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సమాజాన్ని వెనకడుగు వేయించి మహిళల హక్కులను హరించే మనువాద భావజాలానికి వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని అవసరం ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి. కొండారెడ్డి తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులు రెండో రోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి మహిళలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. మహిళలు దీర్ఘకాల పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలు అమలు కాకపోవడం, వాటి స్థానంలో పాతకాలపు సాంప్రదాయాల ఆధారంగా మహిళలను వంటింటికే పరిమితం చేసే ప్రయత్నాలు పెరుగుతున్నాయన్నారు. మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పోటీ పడుతున్నా పురుషాధిక్య భావజాలం పెంచే మనువాద శక్తులు మహిళలను వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మనువాద శక్తులు పెంచుతున్న మూఢనమ్మకాలు, అసమానతలను ఎదిరించాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళా సంఘాలు గ్రామాల నుంచి పట్టణాల వరకూ చైతన్యయాత్రలు నిర్వహించి మహిళల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల, నాయకులు జి.ఆదిలక్ష్మి, కె. లక్ష్మీ ప్రసన్న, ఎస్‌కె. నాగూర్ బి, కె. ధనలక్ష్మి, బి . పద్మ, కె.రాజేశ్వరి, పి.రత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

మాట్లాడుతున్న ఎంఇఒలు శ్రీనివాసరావు, రమేష్‌బాబు

బోధనా అంశాలపై సమావేశం

ప్రజాశక్తి - బల్లికురవ

చేపట్టబోయే విధివిధానాలు వివరించేందుకు మండలంలోని నాలుగు కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నిర్వహించారు. బల్లికురవ, వైదన, కొప్పెరపాడు, కొనిదెన కాంప్లెక్స్‌ల పరిధిలో ఉపాధ్యాయులు అందరూ సమావేశాలకు హాజరయ్యారు. 10వ తరగతి విద్యార్థుల కోసం 100రోజుల శిక్షణ కార్యక్రమాలు, డిసెంబర్ నెలలో జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ విధి విధానాలు, 10వ తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఆయా పాఠశాలల పరిధిలో భోజన అంశాల మెరుగుపరిచే విధంగా తీసుకోబోయే అంశాలు వివరించారు. ఎంఇఒలు శ్రీనివాసరావు, కాకాని రమేష్ బాబు పాల్గొని బోధన అంశాలు వివరించారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ మార్టూరి శ్రీరాంప్రసాద్

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి - నగరం

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సిఎఆర్ ప్రారంభించారు. అందులో భాగంగా శనివారం ఉదయం 11.30 గంటలకు మండలంలోని అద్దంకివారి పాలెంలో సచివాలయం నందు సమావేశం ఏర్పాటు చేసి ప్రజలందరికి డ్రగ్స్, ఆల్కహాల్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ మార్టూరి శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం, వాటి వాడకం వలన కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐ ఎ విజయలక్ష్మి మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, రవాణా గురించిన సమాచారం తెలిస్తే కంట్రోల్ రూమ్ 14405నెంబర్‌కు గాని, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ 94904 55599కు తెలియచేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అదే విదంగా ఆ గ్రామ విఆర్ఒ పోతురాజు, పంచాయతీ సెక్రటరీ విజయశ్రీ సమక్షంలో అందరి చేత డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

బైకును ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

ప్రజాశక్తి - అద్దంకి

నరసయ్య (55)

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరిని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మండలంలోని శాంతినగర్ సమీపంలో నామ్ ఎక్స్ హైవే రోడ్డుపై ప్రమాదం జరిగింది. వెంపరాల గ్రామానికి చెందిన గోసాల శ్రీనివాసరావు, దాసరి నరసయ్య కలసి ద్విచక్ర వాహనంపై అద్దంకి వస్తుండగా ద్విచక్ర వాహనాన్ని కారు అతివేగంగా ఢీ కొట్టింది. దీంతో బైకుపై ఉన్న నరసయ్య (55) అక్కడికక్కడే మృతి చెందాడు. గోసాల శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కాగా వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావైద్యశాలలో నాడి పట్టే నాథుడేడీ.?

ప్రజాశక్తి - బల్లికురవ

24 గంటలు వైద్య సేవలు అందించాల్సిన గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎప్పుడూ అందుబాటులో ఉండరు. ఇటీవల 70 ఏళ్ల వృద్ధుడు పురుగుమందు తాగి ఇంటి ప్రక్కనే ఉన్న వైద్యశాల కదాని అక్కడికి వెళితే డాక్టర్లు, నర్సులు ఎవరూ అందుబాటులో లేక ఆ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటనతో గుంటుపల్లి గ్రామస్తులు స్థానిక వైద్యశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సమయంలో వైద్యం అంది ఉంటే ఆ వృద్ధుడు బ్రతికి ఉండేవాడని అన్నారు. వైద్యం కోసం 108 అంబులెన్స్ వైపు చేతులు చూపిస్తారంటూ అక్కడికి వెళ్లిన రోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తూ నూతన భవనాలు నిర్మాణం చేస్తుంది. సిబ్బంది కొరత లేకుండా ప్రతి చర్యలు తీసుకుంటూ ఉంటే సిబ్బంది మాత్రం పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. వైద్య సేవలో అవసరమైన విపత్కర పరిస్థితుల్లో ఏ ఒక్కరు అందుబాటులో లేకపోతున్న కారణంగా పేదవాడికి వైద్యం అందని ద్రాక్షగా మారుతుంది. ఈ ప్రభుత్వ వైద్యశాల్లో డాక్టర్లు, నర్సులు కలిపి 15 మంది ఉన్నారు. అందులో ఒకరు ఇటీవల మృతి చెందినట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. 24 గంటలు వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడం ప్రభుత్వం ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ విషయాన్ని గమనించిన మలినీడు గోవిందరావు మీడియాకు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రి తీరుపై కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మొక్కుబడిగా సమావేశం

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ ఎనుబర్ల ఎల్లమంద అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు వచ్చేందుకు ఆసక్తి చూపలేదు. ఉదయం 11 గంటలకు సమావేశం మొదలు కావాల్సి ఉండగా ఒంటిగంట వరకు సభ్యులు రాక కోరం లేకపోవడంతో అధికారులు సభ్యుల కోసం ఎదురు చూశారు. మధ్యాహ్నం తర్వాత 16 మంది ఎంపీటీసీ సభ్యులుకు గాను ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం ఉన్నందున సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీలకు గ్రామాల్లో సముచిత స్థానం లేదని, నాలుగేళ్లుగా గౌరవ వేతనాలు లేవని చవిటిపాలెం ఎంపీటీసీ మందలపు రాదయ్య ఆవేదన, తమ నిరసన వ్యక్తం చేశారు. ఎంపిడిఒ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఎంపీటీసీల గౌరవ వేతనం తాము అప్లోడ్ చేశామని అన్నారు. రాష్ట్రవ్యాప్త సమస్యని తెలిపారు. సమావేశంలో విద్యుత్ ఏఈ, సిడిపిఒ, ఎపిఒ, ఎపిఎం, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ, వ్యవసాయ శాఖ అధికారులు తమ శాఖల నివేదికలను వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ వై ఎలమంద, ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, తహశీల్దారు కె రవిబాబు పాల్గొన్నారు.

సమావేశంలో ఎంపిపి యల్లమంద

రహదారిపై వేసిన కంకరతో ఇబ్బందులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రహదారి దెబ్బ తినడంతో దానిని అభివృద్ధి పర్చాలనే దృక్పథంతో అధికారులు తోలించిన కంకరతో ప్రమాదాల నిలయంగా మారింది. మండల కేంద్రం భట్టిప్రోలు పద్మశాలియ కళ్యాణ మండపం ఎదురుగా భట్టిప్రోలు, తెనాలి రహదారి మార్గంలో రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతల మయంగా మారింది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఆర్అండ్‌బి అధికారులు కంకర తోలించారు. ఈ తోలించిన కంకర ఉన్న రహదారి కంటే అడుగు ఎత్తు పైగా రాళ్లు లేచి ఉండటంతో ద్విచక్ర వాహనాలు జారిపడి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై నీరు పోసి రోలింగ్ చేసినప్పటికీ వాహనాల రాకపోకలకు రాళ్లుపైకి లేచి బైకులు జారీ పడిపోతున్నాయని వాపోతున్నారు. ఈ కంకర పోసిన గుట్టపై రోలింగ్ చేసి తారువేస్తే దానికి ఇరువైపులా ఉన్న రహదారి కూడా పల్లపు ప్రాంతంగా మారీ నీరు నిలబడే అవకాశం ఉందని, దీని ఎత్తును తగ్గించి రోల్ చేసి త్వరితగతిన తారు రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజల కోరుచున్నారు.

రోడ్డుపై వదిలేసిన కంకరతో ఇబ్బంది పడుతున్న దృశ్యం

హెల్మెట్ ధరించాలని అవగాహన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్‌లో శనివారం మోటార్ సైకిల్‌పై వెళ్లే వారికి సీఐ కె వెంకటరావు, ఎస్ఐ పట్టాభిరామయ్య హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణాలు కాపాడుకుని మనల్ని మనం రక్షించుకోవచ్చని వాహనదారులకు తెలిపారు. హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తులను గుర్తించి హెల్మెట్ కొనుగోలు చేయించి ధరించి వాహనదారులను పంపించారు. ఈ ప్రక్రియ గత మూడు రోజుల నుండి అడ్డ రోడ్డు జంక్షన్‌లో జరుగుతూ ఉందని ఎస్ఐ తెలిపారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేనివవాళ్లు మృతి చెందుతున్నారని గుర్తించినట్లు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ పట్టాభిరామయ్య

మాట్లాడుతున్న ఎంపిడిఒ స్వరూపరాణి

స్వామిత్వతో చట్టబద్ధమైన హక్కులు

ప్రజాశక్తి - పంగులూరు

స్వామిత్వ పథకం ద్వారా గ్రామస్తులకు వారి ఆస్తులపై చట్టబద్ధమైన హక్కులు, పత్రాలు జారీ చేస్తామని ఎంపిడిఒ కె స్వరూపరాణి అన్నారు. మండలంలోని కశ్యపురం పంచాయతీ కార్యాలయం వద్ద స్వామిత్వ ప్రత్యేక గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ గ్రామస్తులంతా స్వామిత్వ పథకంకు సహకరించాలని అన్నారు. ప్రతి ఇల్లు ప్రతి స్థలానికి సంబంధించిన హద్దులు, కొలతలు, వాటికి సంబంధించిన వివరాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్, సర్పంచ్ దూళిపాళ్ల వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి చెంచులక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి

ఆవాస్ ప్లస్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఇల్లు నిర్మించుకోవాలనుకునే అర్హులు ఎవరైనా ఉంటే ఈ నెల 30లోపు ఆవాస్ ప్లస్ సర్వే చేయించుకోవాలని ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని బావాజీపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ఆవాస్ ప్లస్ సర్వేను హౌసింగ్ శాఖ ఎఇ డి లక్ష్మీనారాయణతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వం అందించే అన్ని గృహ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో ఉన్న పూరిళ్లు, రేకుల షెడ్లు, పెంకుటిళ్లు, ఖాళీ స్థలాలు కలిగినవారు సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి కిషోర్, బీసీ సంక్షేమ సంఘం యువజన నాయకులు గాలి రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపిఎం ఐబికె రవికుమార్

అభయహస్తం ఆగిన వారికి మళ్లీ పెన్షన్

ప్రజాశక్తి - పంగులూరు

అభయ హస్తం పథకంలో పెన్షన్ మంజూరై మధ్యలో ఆగిపోయిన వారికి మళ్లీ పెన్షన్ వచ్చేలా చేయవచ్చని ఎపిఎం థామస్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన విఒఎల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్స్ సమర్పించాలని అన్నారు. డిపిఎం రవికుమార్ మాట్లాడుతూ సిఐఎఫ్ ట్రాకింగ్, విపిఆర్‌ఎన్, ఎస్‌హెచ్‌జి స్టార్టప్ గురించి, మొబైల్ బుక్ కీపింగ్‌పై సమీక్ష చేశారు. సమీ క్షకు డిపిఎం, ఎపిఎం, ఇన్సూరెన్స్, ఎపిఎం కోటేశ్వరరావు, సిసిలు సురేష్, చంద్రశేఖర్, ఎల్‌సి భాస్కర్ హాజరయ్యారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరంలోని కెవివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్యంపై 8, 9 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాఘవరెడ్డి మాట్లాడారు. విద్యార్థులు అన్ని విషయాల్లో శిక్షణ పొంది పరిపూర్ణ వ్యక్తులుగా తయారా వ్వాలని అన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు భయభ్రాంతులకు గురి కాకుండా తగిన సమయస్ఫూర్తితో నిర్ణయం తీసుకొని ప్రమాదం నుండి బయటపడే అవకాశం ఉందని అన్నారు. ఎస్ఎఎస్ సిజి అండ్ ఎంహెచ్ కౌన్సిలర్ జి వినోలియా కుమారి విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ రకాల వ్యక్తిగత రక్షణలపై శిక్షణ ఇచ్చారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నరేంద్రవర్మ

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - బాపట్ల

అగ్ని ప్రమాదానికి గురై ఇల్లు పూర్తిగా కాలిపోయి సర్వం కోల్పోయిన పిట్టలవానిపాలెం మండలం చందోలుకు చెందిన షేక్ బాజీ బేగ్ కుటుంబానికి శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ ఆర్థిక సాయం అందజేశారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు అఫ్జల్, రైల్వే బోర్డు మాజీ సభ్యులు నియాజీ, పాల్గొన్నారు.

గుంటూరు బ్యాంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని బెస్తపాలెంలో ది గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన బ్రాంచిని శనివారం ప్రారంభించారు. ప్రజలకు ఆర్థిక సేవలు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేయటం హర్షనీయమని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, నరసరావుపేట శాసన సభ్యులు అరవింద్ బాబు, ఎపి టూరిజం చైర్మన్ నుకసాని బాలాజీ, గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బి శ్రీనివాస్ యాదవ్, వైస్ చైర్మన్ బసవిరెడ్డి, ఒంగోలు బుడా చైర్మన్ షేక్ రియాజ్, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఆల అనిల్ కుమార్ అన్నారు. ప్రజలకు రుణాలు, డిపాజిట్లు, డిజిటల్ బ్యాంకింగ్ వంటి సేవలు మరింత వేగంగా, నమ్మకంగా అందుబాటులోకి రానున్నాయని అన్నారు. సహకార బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడాల రాములు, కూటమి నాయకులు, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిఆర్‌పిలు

రామ్‌చౌదరిపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఆర్‌పిలు, అధికారులపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానకరంగా ప్రచారం చేసిన మోదుకూరి రామ్‌చౌదరి తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఆర్‌పిలు, మెప్మా ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక పీడీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌పిలు, మెప్మా ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ ప్రజా సేవల కోసం మెప్మా రంగంలో విస్తృత సేవలు అందించే ఆర్‌పిల ను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకొనేది లేదని తెలిపారు. అనంతరం ఉద్యోగులు, ఆర్‌పిలు ఆర్‌డిసి ఆర్ శ్రీనివాసరావు, మెప్మా పీడీ పి శ్రీహరిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన రామ్‌చౌదరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి కల్పన, జిల్లా కార్యదర్శి జి రమేష్, ఎస్‌డి హుస్సేన్, ఆర్‌పి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, రాహేళమ్మ, దేవయాని, నయోమి, సంధ్య పాల్గొన్నారు.

ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- వరిలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉండాలి
- కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రైతులు పండించిన వరి ధ్యానం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మండలంలోని గుడువల్లి రైతు సేవా కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి రైతు పండించిన వరి ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఎవ్వరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన గోని సంచులు, టార్పల్ పట్టాలు అందజేస్తామని తెలిపారు. రైతులు వరి ధాన్యంను బాగా ఎండిన తర్వాతనే సమీపంలోని వరి కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని అన్నారు. వరిలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా రైతులు గుర్తించుకోవలని అన్నారు. 'ఏ' గ్రేడ్ రకం వరి రూ.2389, సాధారణ రకం రూ.2369 ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో 117 కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. గతేడాది జిల్లాలో 90వేల క్వింటాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ సంవత్సరం 2 లక్షల క్వింటాలు వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరాఫరాల శాఖ డిఎం శివపార్వతి, డిఎస్‌ఓ పాల్గొన్నారు.

ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్

లేబర్ కోడ్స్ రద్దుకు ఐక్య పోరాటం

ప్రజాశక్తి - చీరాల

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకు కార్మికులు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం తప్పదని సిఐటియు నాయకులు జి సుధాకర్ అన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిఐటియు, ఎఐటియుసి కార్మిక సంఘాలు ఆందోళన, నిరసన తెలిపారు. తాజా నోటిఫికేషన్‌తో మొత్తం 29 కార్మిక చట్టాలకు బదులుగా 4లేబర్ కోడ్స్ అమల్లోకి తేవడం కార్మిక వ్యతిరేక చర్యని మండిపడ్డారు. 150 ఏళ్ల క్రితం కార్మికులు పోరాటంతో సాధించుకున్న 8 గంటల పని హక్కును బిజెపి ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆరోపించారు. యజమానులకు లాభాలు, కార్మికులకు నష్టాలు కలిగించే ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మరోసారి కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు బి సామ్యూల్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలు చేయడమంటే కార్మిక వర్గాన్ని బానిసల స్థితికి నెట్టేస్తుందని అన్నారు. కార్మికులను అణగదొక్కే యత్నంగా లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని అన్నారు. అనంతరం ఆందోళనలో భాగంగా లేబర్ కోడ్స్ జిఒ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి ఇమ్మాని యేలు, బి పోతురాజు, ఎఐటియుసి నాయకులు ఎ బాబురావు, మేడా వెంకట్రావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

దళారులకే ధాన్యం అమ్మకం.!

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభం అయ్యాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు హార్వెస్టర్ ద్వారా ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చు కుంటున్నారు. ధాన్యం కోతలు ప్రారంభం కాకముందే ప్రభుత్వం అట్టహాసంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. కానీ ఆ కేంద్రాల్లో ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి కొనుగోళ్లు ప్రారంభించడానికి అవసరమైన దిశా నిర్దేశం అందలేదు. దీని కారణంగా రైతులు హార్వెస్టర్లతో కోతలు చేపట్టిన ధాన్యాన్ని బైట ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోక తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగానే ఈ ఏడాది ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చని భావించిన రైతాంగానికి ప్రైవేటు బారిన పడక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' గ్రేడ్ ధాన్యానికి 75కేజీల బస్తా రు.1792, 'బి' గ్రేడ్ రకం ధాన్యం 75కేజీల బస్తా రు.1,777 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. దీనిలో తేమ 17 శాతంగా మించి ఉండ కూడదనే నిబంధన ఉంది. అయితే రైతులు ఈ ఏడాది అధిక శాతం 'ఏ' గ్రేడ్ రకాన్నే సాగు చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ఇక్కడ ఇస్తే వెంటనే డబ్బులు బ్యాంకులో జమవుతాయనే దృక్పథంతో ఆశపడ్డామని, కానీ ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొనుగోలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలోని అమృతలూరు, చుండూరు, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో 90వేల ఎకరాలకు పైగా రైతులు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో 75 కేజీల బస్తా రూ.1300 నుండి రూ.1400కు మించి విక్రయించలేకపోతున్నారు. అధిక ఖర్చులు వెచ్చించి సాగుచేసిన పంట చేతికి వచ్చే సమయానికి మొంత తుఫాన్ కారణంగా నేలవాలి దిగుబడులు తగ్గుతున్నాయని అన్నారు. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న ధరకు విక్రయించుకుంటే ఖర్చులు కూడా లభించే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే దృక్పథంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు త్వరితగతిన రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి కొనుగోలు చేపట్టాలని కోరుచున్నారు.

రహదారిపై ఆరబోసిన ధాన్యం

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చీరాల

108 వాహనాల్లో పైలట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పి బాలకృష్ణ శనివారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై హెవీ లైసెన్స్, ట్రాన్స్‌పోర్ట్ లేదా బ్యాడ్జ్ కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 24న సోమవారం సాయంత్రంలోపు చీరాల ప్రభుత్వ ఏరియా వైద్యశాల 108 కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 83095 30078, 95812 53538 సంప్రదించాలని కోరారు.

మాట్లాడుతున్న పిడి ఎ విజయలక్ష్మి

ఉపాధి హామీపై గ్రామసభలు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి ప్రత్యేక గ్రామసభలు శనివారం నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ విజయలక్ష్మి, ఎంపిడిఒ కె నేతాజీ మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి ఉపాధి హామీ పథకం శ్రామికులందరికీ ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. ఈకేవైసీ చేసే సమయంలో గ్రామంలో లేని వారు, చనిపోయిన వారి జాబ్ కార్డులను రద్దు చేసినట్లు చెప్పారు. రద్దయిన జాబ్ కార్డులు పునరుద్ధరణ చేయడానికి, కొత్తగా జాబ్ కార్డులు కోరిన వారికి జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామస్తులు ఈ సదావకాశం సద్వినియోగం తీసుకోవాలని అన్నారు. సర్పంచ్ బాలిగ శివపార్వతి అధ్యక్షతన జరిగిన సభలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎపిఒ జె లక్ష్మీదేవి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీకాంత్ ఉడికేరి

వ్యవసాయ విద్యతో విదేశాల్లో ఉద్యోగాలు

ప్రజాశక్తి - బాపట్ల

వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులైన అభ్యర్థులు ప్రపంచంలో ఏ రంగంలో నైనా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని కర్ణాటక గుల్బర్గా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ శశికాంత్ ఉడికేరి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో జరుగుతున్న దీక్షారంభం 2025 ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. వ్యవసాయ విద్యలో నూతనంగా పట్టా పుచ్చుకున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి వ్యవసాయ శాస్త్రం విశాలమైన అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. తానే స్వయంగా ఎన్నో దేశాలు సందర్శిస్తూ తాను చేసిన కీటక శాస్త్ర పరిశోధనలే తనను ప్రపంచ దేశాల స్థాయికి తీసుకెళ్లాయని అన్నారు. వ్యవసాయ విద్య కేవలం వ్యవసాయ సంబంధితమైనదిగా మాత్రమే గాక గ్రామీణ అభివృద్ధి, పర్యావరణం, వృక్షశాస్త్రం, వాతావరణ శాస్త్రం వంటి అనేక అనుబంధ అంశాలు కలిసి ఉన్న సమగ్ర విభాగమని అన్నారు. అందు వలన వ్యవసాయ విద్యార్థులు వివిధ అగ్ని, జల, వాయు పరిస్థితులను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే వ్యవసాయ విధానం పట్ల సమగ్ర అవగాహన కలుగుతుందని అన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, యువజనోత్సవాలు, ఇతర విద్యా సంస్థల సందర్శనలు విద్యలో భాగమేనని అన్నారు. 10రోజుల పాటు నిర్వహించిన దీక్షారంభం కార్యక్రమాలపై సమీక్షను ఎం శ్రీరేఖ విశదీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి, ఎం సంధ్య, ఎస్ఆర్ కోటేశ్వరరావు, డివి సాయిరామ్ కుమార్, లాల్ అహ్మద్ మొహమ్మద్ పాల్గొన్నారు.

ద్రోణాదుల యువకుడికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పెంట్యాల శ్రీనివాస్

తెలుగు యువకుడి ప్రతిభకు ప్రపంచ వేదికపై మరో గౌరవం దక్కింది. అట్లాంటా కాలేజ్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ నిర్వహించిన పట్టాభిషేక వేడుకలో మండలంలోని ద్రోణాదులకు చెందిన పెంట్యాల శ్రీనివాస్ కుమారుడైన ధర్మతేజ ప్రతిష్ఠాత్మక డాక్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ అందుకున్నాడు.

సూర్యలంక బీచ్‌ను అభివృద్ధిచేస్తాం

టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల సూర్యలంకలోని హరిత రిసార్ట్‌ను ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిసార్ట్‌లోని వసతులు, సదుపాయాలు, బీచ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పర్యాటకులకు అందిస్తున్న సేవల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ సూర్యలంకను ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా అభివద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రిసార్ట్ సౌకర్యాల విస్తరణ, భద్రతా ఏర్పాట్ల మెరుగుదల, పర్యాట కులను ఆకట్టుకునే ప్రత్యేక ప్యాకేజీల రూపకల్పనపై దృష్టి సారించాలని సూచించారు. వారాంతాలు, సెలవుదినాల్లో పెరిగే పర్యాటక రద్దీ దష్ట్యా సేవల నాణ్యత, పరిశుభ్రత, జనసంచారం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు ,పాల్గొన్నారు.

హరిత రిసార్ట్‌లో పరిశీలిస్తున్న బాలాజీ

చైర్మన్ కారును టోల్ ఫీజ్ కోసం ఆపిన సిబ్బంది

సూర్యలంక రిసార్ట్ ప్రాంతానికి వెళ్తున్న చైర్మన్ వాహనాన్ని టోల్ వసూలు పేరుతో సిబ్బంది ఆపడం బాలాజీని అసంతప్తికి గురిచేసింది. టూరిజం ప్రాంతానికి వచ్చే వాహనాలపై టోల్ వసూలు చేయడం సరికాదని, ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని ఆమర తెలిపారు. పంచాయతీ సిబ్బంది టోల్ ఫీజ్ వసూలు చేస్తున్నట్లు తెలుకున్న బాలాజీ ఫీజు ఎలా వసూలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు, విధి విధానాలు ఏమిటో తెలుసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వికలాంగులకు ఎల్‌ఎల్‌ఆర్‌లు పంపిణీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎల్‌ఎల్‌ఆర్ మేళాలో ఉత్తీర్ణులైన 57 మంది వికలాంగులకు ఎల్‌ఎల్‌ఆర్‌ను ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల శనివారం అందజేశారు. సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ఒంగోలు పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో ఈనెల 21న ఎల్‌ఎల్‌ఆర్ మేళా నిర్వహించారు. ఇందులో 57 మంది వికలాంగులు స్లాట్స్‌ను బుక్ చేసుకున్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన 57 మందికి ఎల్‌ఎల్ ఆర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త, రవాణా శాఖ అధికారులు జయప్రకాష్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా మార్పు

కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మినీ అంగన్ వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్ వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో అంగన్ వాడీ కేంద్రాల మిళితంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల, బాలింతలకు మరిన్ని సేవలు అందించే క్రమంలో మీని అంగన్‌వాడీ కేంద్రాలను సాధారణ కేంద్రాలుగా మార్పు చేస్తున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రీస్కూల్ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు వీలు కలుగుతుందని వివరిం చారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఉన్న 16 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డిఇఒ పురుషోత్తం, ఆర్‌డిఒ గ్లోరియా పాల్గొన్నారు.

దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' ను నిలిపేయాలి

వామపక్ష సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

దండకారణ్యంలో ఖనిజ సంపదల దోపిడీకి మార్గం సుగమం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట నిర్వహిస్తున్న సైనిక చర్యలను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష నాయకుల నాయకుడు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక, ప్రకాశం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు మాట్లాడుతూ విదేశీ కంపెనీలకు ఖనిజాలను అప్పగించేందుకు అడవుల్లో గిరిజనుల హక్కులను కలరాస్తూ, వారిని అణచివేసేందుకు కగార్ ఆపరేషన్ పేరుతో విధ్వంస కాండను సృష్టిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసుల కోసం పోరాడుతున్న మావోయిస్టు నాయకులను ఎన్‌కౌంటర్ల పేరుతో దారుణంగా హతమార్చు తున్నారన్నారు. ఓ వైపు శాంతి చర్చల పేరుతో కల్ల బొల్లి మాటలు చెబుతూ మరోవైపు పట్టుబడిన వారిని కోర్టులకు హాజరు చేయకుండా చిత్రహింసలతో చంపేయడం ప్రభుత్వ దుశ్చర్యగా పేర్కొన్నారు. 2026 మార్చి 30 నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని హోమంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. అర్బన్ నక్సల్స్ పేరుతో మతఛాందస శక్తులు ప్రజలను బెదిరించడం ఆందోళనకరమన్నారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం ఉన్నంతవరకూ ప్రశ్నించే తత్వాన్ని ఎవరూ అణచలేరన్నారు. ఆలోచనలను పోలీసు బలంతో నిర్మూలించడం అసాధ్యమన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు, ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావల సుధాకర్, జిల్లా కార్యదర్శి సిఎస్. సాగర్, సిఎల్‌సి నాయకుడు వీరాంజనేయులు, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, పిడిఎం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, పికెఎం జిల్లా కార్యదర్శి శ్రీను, ఎఐపిఎస్సీ నాయకుడు ధరణికోట లక్ష్మీనారాయణ, గిరిజన సంఘం నాయకులు పేరం సత్యం, పిఒడబ్ల్యు నాయకురాలు. పద్మ, పిడిఎస్‌యు నాయకుడు ఎల్‌జరాజశేఖర్, ఐఎఫ్‌టియు నాయకుడు ఆర్. మోహన్, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బేగ్, అరుణోదయ నాయకుడు జాలన్నకె. నరసింహం పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటరు వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లేబర్ కోడ్స్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల కాపీలను దహనం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు మోహన్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి యంయస్.సాయి, ఎఐటియుసి నాయకులు ఎస్‌డి. సర్దార్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల అమలు కార్మిక వర్గాన్ని కార్పొరేట్ కాపిటల్‌కు తాకట్టుపెట్టే మోడీ ప్రభుత్వ కుట్రగా ఆరోపించారు. శతాబ్దకాలం పాటు పోరాటాలతో కార్మికులు సాధించుకున్న హక్కులను ఒక్క కలం పోటుతో తుడిచిపెట్టివేయడమే లేబర్ కోడ్‌ల అసలు ఉద్దేశమని విమర్శించారు.పని గంటలను పెంచడం ద్వారా కార్మికులను శారీర, మానసికంగా వేదనకు గురిచేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు అమలు జరిగితే దేశ కార్మికులు 'నయా బానిసలుగా' మారిపోవడం తప్పదన్నారు. కార్మిక హక్కులపై పెట్టిన ఉరితాడును తెంచి వేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్మికులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలంటే రాజకీయ పోరాటం తప్పదని, బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.మహేష్, బివి.రావు, కొర్నెపాటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్, విజయమ్మ, రాములు, పింఛను దారుల సంఘం నాయకులు జి. శేషయ్య, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోవాలి

కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉప సంహరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సిఐటియు)ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో బైపాస్ సెంటర్ శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాగంగా కార్మికులు లేబర్ కోడ్ ఉత్తర్వులను దహనం చేసి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. యూనియన్ కార్యదర్శి ఎస్‌డి.హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి రమేష్ మాట్లాడుతూ కార్మికులు, కార్మిక సంఘాలు ప్రతిపక్ష పార్టీలు ఏకగళంగా వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా లేబర్ కోడ్లను అమలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సుదీర్ఘకాలం పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లలో విలీనం చేయడం వల్ల కార్మికులు తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వేతనాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు, కార్మిక శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటం, అధికారుల జోక్యం తగ్గిపోవడం లాంటి పరిణామాలతో కార్మికులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సంక్షేమ సౌకర్యాల్లో కోతలు, ఉద్యోగ భద్రత దెబ్బతినడం లాంటి పలు ప్రతికూల ప్రభా వాలు కార్మిక వర్గాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయని హెచ్చరించారు. కార్మికుల హక్కులను బలహీనపరచే, యాజమాన్యాలకు లాభాలు చేకూర్చే లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించాలి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. తిరుపతయ్య, వెంకయ్య,, సిహెచ్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు నిరసన

నాలుగు లేబర్ కోడ్‌లు అమలు జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో మస్టర్ పాయింట్ల వద్ద నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా లేబర్ కోడ్‌లకు సంబం ధించిన జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సంద ర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్, మున్సిపల్ యూనియన్ నగర నాయకుడు కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత శతాబ్ద కాలంగా కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కొత్త లేబర్ కోడ్లు పూర్తిగా కరగదీస్తున్నాయని తెలిపారు. ఇది కార్పొరేట్ల లాభాల కోసం కార్మికులను బలిపశువులుగా మార్చే విధానమని విమర్శించారు. పని గంటలను పెంపు, భద్రతా హామీలు తగ్గించడం, మహిళలను నైట్ షిఫ్టుల్లో పని చేయాలనే నిర్ణయాలు కార్మిక శ్రేయస్సును పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని మండి పడ్డారు. ప్రభుత్వం గ్రాట్యూటీ ఏడాది పూర్తయిన తర్వాతే అందిస్తామని చెప్పడం, కాకుండా, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయకుండా సమ్మె హక్కును తొలగించే ప్రయత్నం చేయడం కార్మిక వర్గంపై నేరుగా దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వై.రవి, సింహాద్రి, అరుణకుమారి, ఎం.బాబు, యు.కుమారి, కె.మోహనరావు, ఆర్.రాములు, విజయమ్మ, అనిత, సంతోషమ్మ, కె.ఆనంద్, సిహెచ్. రాజు పాల్గొన్నారు.

అద్దంకి బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మస్టర్ పాయింట్ వద్ద జీవో కాపీలు దగ్ధం చేస్తున్న కార్మికులు

బైపాస్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు